'ఫన్' నీరు
శంకర నారాయణ



# కొంటె ప్రశ్నలడిగేవారిపై పన్నీరు 'ఫన్' నీరు

- మీ ఇంట్లోంచి దెబ్బల చప్పుళ్ళూ, ఆ వెంటనే మొగ గొంతుతో గావుకేకలూ వినబడుతున్నాయని మీ పక్కింటి వాళ్ళు శషభిషలు పోతున్నారు. ఇంతకీ ఎవరిదీ పై చేయి మీ ఇంట్లో?

నా ఏడుపేదో నేను ఏడుస్తాను..నా ఏడుపు వినాలని మీకెందుకంత ఏడుపు..!?

- తెలుగు హీరోలు కోట్లు చేసుకుంటుంటే, ఎందుకండీ వాళ్ళ అభిమానులు టికెట్ లైన్లలో కుమ్ముకుని ప్రాణాలర్పిస్తున్నారు?

'చచ్చే'టంత అభిమానం కాబట్టి..!

- ఒకాయన తిరుపతి వెళ్ళి, వెయ్యి రూపాయల టికెట్ కొనుక్కుని, ఒకే ఒక గంటలో దైవ దర్శనం చేసుకున్నాడుట. ఇంకొకాయన ధర్మ దర్శనం లైన్లో గంటల తరబడి నిలబడి దైవ దర్శనం చేసుకున్నాడుట. ఈ ఇద్దరిలో పుణ్యం ఎవరికి ఎక్కువ వొస్తుందీ?

ఏదీ ఉత్తి పుణ్యానికి రాదని దేవుడికీ తెలుసు..! డబ్బున్న వాడికే ఎక్కువ పుణ్యం ముట్టచెబుతాడు..

- తెలుగుని ప్రాచీన భాషగా గుర్తించాలంటే, అమెరికాలో వున్న తెలుగు వారేం చేయాలి?

ఏమీ చెయ్యాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అమెరికా తెలుగు వారికి ఆల్రెడీ తెలుగు ప్రాచీన భాషే..! కావాలంటే అమెరికాలో పుట్టి పెరిగిన పిల్లలనడగండి..!

- మీ జవాబులు చదివి పాఠకులు మీ గురించి ఏమనుకుంటారు?

మంచి 'జవాబు దారీ' మనిషి అనుకుంటారని నా నమ్మకం

- ఎమ్మెల్లేలకి గోడలు దూకడంలో కూడా ట్రైనింగ్ ఇస్తున్నారా ఈ మధ్యన?

మరొకళ్ళ వద్ద ట్రైనింగ్ తీసుకోవాల్సిన ఖర్మ వారికేమిటండీ..! వాళ్ళే ఇంకొకరికి గోడలు దూకడంలో ట్రైనింగ్ ఇవ్వగలరు..!

➢ సొంత సెక్యూరిటీ గార్డులకే మస్కా కొట్టి పారిపోయే రాజకీయనాయకుల్ని ఏమని పిలిస్తే బావుంటుందంటారు?

అలా తప్పించుకోవడం కూడా సెక్యూరిటీనే అని వాళ్ళ నమ్మకం..!

➢ ఈ కాలపు ప్రేమ వివాహాల గురించి మీ అభిప్రాయం?

ఇన్స్టంట్..!

➢ ఈ మధ్య ఒక దినపత్రికలో ప్రతిరోజూ పబ్ లో నైట్ లైఫ్ అంటూ ఫోటోలు వేస్తున్నారు. ఒక ఫోటోలో వ్యక్తి మీలానే ఉన్నారు..కొంపతీసి అది మీరేనా?

మీదీ నా పోలికే అని విన్నాను..!

➢ మా ఆవిడకి తెలీకుండా తన అప్పడాలకర్ర తీసుకెళ్ళి పోలీస్ స్టేషన్‌లో సరెండర్ చెయ్యాలని ఉంది..మళ్ళీ తనకి తెలిస్తే నా బతుకేమౌతుందోనని భయంగా వుంది. ఏమైనా సలహా ఇస్తారా?

తెలిసి చేసినా తెలీక చేసినా అప్పడాల కర్ర కనిపించకపోతే మీ బతుకు బస్టాండే.!

➢ ఒరిస్సా అడవులనుంచీ పారిపోయి ఆంధ్రాగ్రామాల మీదకి దండెత్తుతున్న ఏనుగుల మందని కంట్రోలు చేయడానికి మిమ్మల్ని నియమిస్తే మీరు ఏం చేస్తారు?

‘గజ’ దొంగనౌతాను

➢ మీ ప్రశ్నలు జవాబులు చూస్తుంటే పౌరాణిక నాటకాల్లో నారదుడి పాత్రకి మీరు అచ్చుగుద్ది నట్లు సరిపోతారనిపిస్తోంది. మీకేమైనా నాటకానుభవం ఉందా?

నాటకానుభవం లేదుకానీ.. నాటకాలకు అడ్డుకట్ట వేసే అనుభవం ఉంది..!

---

చిలిపి ప్రశ్నలకి హాస్యబ్రహ్మ, హాస్యావధాని శంకరనారాయణగారి నుంచీ కొంటె సమాధానాలు తెలుసుకోవాలని ఉందా!? ఇంకా ఆలశ్యమెందుకు.. మీ చిలిపి ప్రశ్నల్ని **editor@koumudi.net** కి వెంటనే పంపించండి..!!